మన రాజధాని
రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
శుక్రవారం 30 అక్టోబర్ 2026 పేజీలు : 4

బ్రహ్మాం వ్యూహం మెజారిటీ పై లెక్కలు..

మాచర్ల మున్సిపల్ పీఠంపై కేశవరెడ్డి రాజకీయ స్కెచ్ దాదాపు కొలిక్కి వచ్చినట్లే కనిపిస్తోంది. సతీమణి సుష్మారెడ్డిని చైర్మన్ పీఠంపై కూర్చోబెట్టడమే తరువాయి అన్నట్టుగా కూటమి అడుగులు పడుతున్నాయి. కేశవ్ కుటుంబానికి పట్టణ ప్రజల మద్దతు పెరుగుతోందన్న సంకేతాల మధ్య, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి వ్యూహం.. కృష్ణుడి ప్రచారానికి తోడు నేడు డొక్కా ప్రచారం రాజకీయ వేడిని పెంచుతున్నాయి. నామినేషన్ వేళ భారీ ప్రదర్శనకు టీడీపీ సిద్ధమవుతుండటంతో ఇప్పుడు అందరి దృష్టి మెజారిటీ లెక్కలపైనే! చర్ల పీఠంపై కేశవ్ వ్యూహం ఏ మేరకు ఫలిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

ప్రజాబలానికి లక్కం రాజు కేరాఫ్..

ఆపదలో అండగా.. అవసరంలో తోడుగా

ఆదిలక్ష్మి ఏకగ్రీవంతో

పిట్టలవానిపాలెంలో రాజకీయ వేడి

పిట్టలవానిపాలెం మండల రాజకీయాల్లో ఆదిలక్ష్మి ఏకగ్రీవ ఎన్నిక ఆసక్తికర చర్చకు తెరలేపింది. మంతెనవారిపాలెంలో రెండుసార్లు సర్పంచ్‌గా గెలిచిన ఆమెకు ఉన్న రాజకీయ అనుభవం, భర్త వెంకటపతి రాజు ప్రజాసంబంధాలు ఇప్పుడు ప్రధానంగా ప్రస్తావనకు వస్తున్నాయి. ఎమ్మెల్యే సొంత మండలంలో ఈ పరిణామం చోటుచేసుకోవడంతో ఏకగ్రీవం వెనుక ప్రజాబలమా.. రాజకీయ అదృష్టమా? అన్న చర్చ స్థానికంగా మొదలైంది.

పిట్టలవానిపాలెం రక్షణ న్యూస్

మాచర్లలో 'మాస్' పాలిటిక్స్.. టీడీపీ దూకుడు!

48 గంటల్లో ప్రచార స్వరూపమే మార్చిన జూలకంటి వ్యూహం

మైనార్టీ వార్డుల్లో ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి జోరు..

వైసీపీ శిబిరంలో గుర్తుల గందరగోళం!

వీధుల్లో హడావుడి.. రాజకీయాల్లో వేడి.. ప్రత్యర్థి శిబిరాలకు సవాల్! టీడీపీ కూటమి ప్రచార రథం ఒక్కసారిగా వేగం పెంచడంతో మాచర్ల మున్సిపల్ పోరు కొత్త మలుపు తిరిగింది. నేతల రాకతో క్యాడర్‌లో జోష్.. అడుగడుగునా రాజకీయ సందడి.. వార్డువార్డునా బలప్రదర్శనతో ఎన్నికల వాతావరణం హీటెక్కింది. తెరవెనుక సమీకరణాలకు తెరదించి, బహిరంగ ప్రచారంలో సత్తా చాటేందుకు కూటమి నేతలు కదం తొక్కుతున్నారు. జూలకంటి రాజకీయ ఎత్తుగడలకు లావు శ్రీకృష్ణదేవరాయల ప్రచార బలం తోడవడంతో మాచర్లలో ఎన్నికల సందడి పతాకస్థాయికి చేరింది. ఈ హడావుడి ప్రత్యర్థి శిబిరంలో ఎలాంటి ప్రభావం చూపుతుంది? ప్రచార జోరును ఓట్ల వర్షంగా మార్చుకునేది ఎవరు? మున్సిపల్ పీఠంపై పాగా వేసేదెవరు? అన్న ఉత్కంఠ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో నెలకొంది.

మాచర్ల, ప్రత్యేక ప్రతినిధి (శిలార్):

ధూమ్ ధామ్..

దబిడి దిబిడే!

వివరాలు 2లో..

పల్లెల్లో హోరు..

నరేంద్ర జోరు!

డాన్సులు.. స్టెప్పులతో

యువతలో ఉత్సాహం

గ్రామగ్రామాన కూటమి అభ్యర్థుల కోసం ఎమ్మెల్యే విస్తృత ప్రచారం

వివరాలు 2లో..

కర్లపాలెం పల్లెల్లో ఇప్పుడు ఎన్నికల సందడి మామూలుగా లేదు.. ఎక్కడ చూసినా కూటమి ప్రచార హోరు.. యువత కేరింతలు.. డాన్సులు, స్టెప్పులతో రాజకీయ వాతావరణం ఉత్సాహభరితంగా మారుతోంది. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అడుగుపెడుతున్న గ్రామాల్లో ప్రచారానికి కొత్త జోష్ వస్తుండగా, ఆయన అనుసరిస్తున్న వ్యూహాలు స్థానిక రాజకీయాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ స్ఫూర్తితో కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతూ, అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నరేంద్ర వర్మ ముందుకు సాగుతున్నారు. గ్రామాల వారీగా ప్రచారాన్ని విస్తరిస్తూ, ప్రజలతో మమేకమవుతూ సాగుతున్న ఆయన పర్యటనలు ఎన్నికల పోరును మరింత వేడెక్కిస్తున్నాయి. అయితే ఈ ప్రచార జోరు ఓట్ల రూపంలో ఎంతటి ఫలితాన్ని ఇస్తుందన్నదే ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

జగదీష్, బాపట్ల రక్షణ ప్రతినిధి..

24-10-26 rakshana - Copy_praja jyothi Medhak.qxd 10/30/2026 5:47 AM Page 3

నిరుపేద వృద్ధునికి రెడ్డి సేవా మిత్ర చేయూత

కర్లపాలెం రక్షణ న్యూస్

మండలంలోని కర్లపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎం.వి. రాజుపాలెం రెండో లైన్‌లో నివసిస్తున్న నిరుపేద వృద్ధునికి రెడ్డి సేవా మిత్ర ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఆపదలో ఉన్న పేదలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సహాయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి సేవా మిత్ర సెక్రటరీ ఏట్రా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ, గ్రామాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాల నిర్వహణ, విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల అందజేత వంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరుపేదలకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి సహాయం అందించడం, విద్యార్థులను ప్రోత్సహించడం, గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా మిత్ర అధ్యక్షుడు నంగు గోవర్ధన్ రెడ్డి, కోశాధికారి అట్ల హరిబాబురెడ్డి, అట్ల శ్రీనివాసరెడ్డి, పయనం శ్రీనివాస్ రెడ్డి, అట్ల రాయుడు, అట్ల వెంకటరెడ్డి, రావి గోపిరెడ్డి, తుమ్మ నాగరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సమస్యకు పరిష్కారం చూపాలి

కర్లపాలెం రక్షణ న్యూస్

కర్లపాలెం మండలం దిండువారిపాలెం పంచాయతీ పరిధిలో రహదారి పక్కన చెత్త వేస్తుండటంతో స్థానిక ప్రజలు, వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను నిర్దేశిత చెత్త సేకరణ కేంద్రానికి తరలించాల్సి ఉండగా, రహదారి పక్కనే పడవేయడం వల్ల పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. ఈ సమస్యపై సంబంధిత పంచాయతీ అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామంలో ఇళ్ల నుంచి సేకరించిన చెత్త రహదారి వెంట పేరుకుపోవడంతో వాహనాల రాకపోకల సమయంలో గాలికి చెత్త ఎగిరి వాహనచోదకులు, పాదచారులపై పడుతోంది. దీంతో ప్రయాణికులకు అసౌకర్యం కలగడమే కాకుండా, రహదారిపై ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్త పేరుకుపోవడం వల్ల దుర్వాసన వ్యాపించే పరిస్థితి ఏర్పడటంతో పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యంపై ప్రభావం పడకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గ్రామంలో చెత్త సేకరణ కేంద్రం అందుబాటులో ఉన్న నేపథ్యంలో, రహదారి పక్కన చెత్త వేయకుండా సేకరించిన వ్యర్థాలను కేంద్రానికి తరలించేలా పారిశుధ్య సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. చెత్త సేకరణ, తరలింపు ప్రక్రియను పర్యవేక్షిస్తూ గ్రామంలో పరిశుభ్రతను కాపాడేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించి, వాహనచోదకులు, పాదచారుల ఇబ్బందులను తొలగించే దిశగా పంచాయతీ అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ప్రచార జోరు

చీరాల రక్షణ న్యూస్

చీరాల పట్టణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 28వ వార్డు కూటమి అభ్యర్థి మల్లెల సుప్రజ, 31వ వార్డు అభ్యర్థి మల్లేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి శ్రీమతి హానీ స్పందన విజయమే లక్ష్యంగా చీరాల నియోజకవర్గ యువ నాయకుడు శ్రీ మద్దులూరి గౌరీ అమర్నాథ్ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయా ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా గౌరీ అమర్నాథ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి వార్డులోని ప్రజలకు అందాలంటే స్థానిక సంస్థల్లోనూ కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులను

గెలిపించి, తమ ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 'చెప్పాం... చేస్తున్నాం' అనే నినాదంతో కూటమి ప్రభుత్వం ప్రజల ముందుకు వస్తోందని, ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ స్థానిక ఎన్నికల్లో మద్దతు కోరుతున్నామని నాయకులు పేర్కొన్నారు. చీరాల పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు ప్రశాంతమైన, సుందరమైన పట్టణంగా రూపుదిద్దుకోవాలంటే స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య నాయకత్వంలో చీరాల మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో కూటమి అభ్యర్థులు ముందుకు సాగుతున్నారని స్థానిక నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, మిత్రపక్షాల నేతలు, స్థానిక ప్రముఖులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొనడంతో ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొంది.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

జనరల్ అబ్జర్వర్ పద్మావతి

బాపట్ల రక్షణ న్యూస్

బాపట్ల జిల్లాలో నవంబర్ 5న జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని జనరల్ అబ్జర్వర్ ఏ.ఏ.ఎల్. పద్మావతి, ఐఏఎస్, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఎన్నికల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గురువారం బాపట్ల మండల పరిధిలోని బేతపూడి, వెదుళ్లపల్లి, స్టువర్టుపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జనరల్ అబ్జర్వర్ సందర్శించి, అక్కడ

చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలు, ఓటర్ల ప్రవేశం, నిష్క్రమణ మార్గాలు, రిసెప్షన్ ఏర్పాట్లు, తాగునీటి సదుపాయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ముందుగానే సమకూర్చాలని అధికారులకు సూచించారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్దేశిత ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (జడ్పీ సీఈఓ), బాపట్ల ఆర్డీఓ, ఎంపీడీఓ, తహసీల్దార్ తదితర అధికారులు జనరల్ అబ్జర్వర్ వెంట ఉన్నారు.

ఎన్నికల భద్రతకు సమర్థ్ సాంకేతిక రక్షణ కవచం

బాపట్ల రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీస్ బలగాల సమన్వయం, శాంతిభద్రతల పర్యవేక్షణను మరింత వేగవంతం చేసేందుకు బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్, గురువారం 'సమర్థ్' మొబైల్ యాప్‌ను ప్రారంభించారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో యాప్ పోస్టర్‌ను ఆవిష్కరించి, దాని పనితీరును వివరించారు. ఎన్నికల సమయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది మధ్య సమాచార మార్పిడిని వేగవంతం చేయడంతో పాటు, సమస్యాత్మక ప్రాంతాలకు తక్షణమే బలగాలను తరలించేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని

ఎస్పీ తెలిపారు. గూగుల్ మ్యాప్స్ ఆధారంగా పోలీస్ సిబ్బంది లొకేషన్‌ను పర్యవేక్షించడం, పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను సమన్వయం చేయడం దీని ప్రధాన ప్రత్యేకతలని పేర్కొన్నారు. యాప్‌లోని SOS బటన్ ద్వారా అత్యవసర పరిస్థితులపై అధికారులకు సమాచారం అందించవచ్చని, ఒకే నోటిఫికేషన్‌తో పోలీస్ సిబ్బందికి ఆదేశాలు చేరవేయవచ్చని వివరించారు. మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను అవసరమైన ప్రాంతాలకు వేగంగా పంపించేందుకు ఇది దోహదపడుతుందన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటున్నామని, ప్రజలకు భద్రతాభరోసా కల్పించడమే లక్ష్యమని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్. సుధాకర్, ఎస్బీ సీఐ నారాయణ, ఎలక్షన్ సెల్ సీఐలు సూర్యనారాయణ, శ్రీనివాసరావు, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, ఐటీ కోర్ ఎస్ఐ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత ఓటింగ్‌కు పోలీసుల భరోసా

గుంటూరు రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా నిర్వహించేందుకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతోంది. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు పొన్నూరు మండలంలోని సున్నిత గ్రామాలైన బ్రాహ్మణ కోడూరు, మన్నవలో గురువారం పోలీసులు కవాతు నిర్వహించి ప్రజలకు భద్రతాభరోసా కల్పించారు. పొన్నూరు రూరల్ సీఐ కృష్ణయ్య, ఎన్నికల నోడల్ అధికారి సీఐ హైమారావు, పొన్నూరు రూరల్ ఎస్ఐ వి. శ్రీహరి, చేబ్రోలు ఎస్ఐ పర్యవేక్షణలో పొన్నూరు రూరల్ పోలీస్ సిబ్బంది, ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్) బలగాలు ఈ కవాతులో పాల్గొన్నాయి. తొలుత బ్రాహ్మణ కోడూరు గ్రామంలో కవాతు నిర్వహించిన పోలీసులు, అనంతరం మన్నవ గ్రామానికి చేరుకుని ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల నియమావళి అమలు, అవాంఛనీయ సంఘటనల నివారణ లక్ష్యంగా ఈ కవాతు నిర్వహించారు.

ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని అధికారులు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు.

తుఫాన్ కి దెబ్బతిన్న వరి పొలాల పరిశీలన

భట్టిప్రోలు రక్షణ న్యూస్

అర్నబ్ తుఫాన్ కారణంగా నేలకొరిగి, వర్షపు నీటిలో మునిగిపోయిన వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి బి. బ్రహ్మారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. వీలైనంత త్వరగా పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపించాలని సూచించారు. వర్షాలు తగ్గిన అనంతరం ఎండ తీవ్రత పెరిగి వరి పంటకు బ్యాక్టీరియా ఎండాకు తెగులు సోకినట్లు

గుర్తిస్తే, ప్లాంటోమైసిన్ 1 మి.లీ.తో పాటు కాసుగామైసిన్ 2 గ్రాములను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే, 50 గ్రాముల కళ్ల ఉప్పును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల ధాన్యం గింజలు మొలకెత్తడం, రంగు మారడం వంటి సమస్యలను తగ్గించవచ్చని వివరించారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు పంట నష్టం అంచనాలకు సంబంధించి ఉత్తర్వులు వెలువడిన తర్వాత గ్రామ, మండల స్థాయిల్లో ఏర్పాటు చేసే బృందాల ద్వారా నష్టాన్ని అంచనా వేస్తామని బ్రహ్మారెడ్డి తెలిపారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు

నాలుగవ సెగ్మెంట్లో ప్రచారం మమ్మరం

భట్టిప్రోలు రక్షణ న్యూస్

మండల కేంద్రమైన భట్టిప్రోలు లోని నాలుగవ సెగ్మెంట్లలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. భట్టిప్రోలు నాలుగవ సెగ్మెంట్లో కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కటకం కుమారస్వామి ఎన్నికల ప్రచారాన్ని ఇంటింటికి తిరిగి ముమ్మరం చేశారు. కుమార్ స్వామి ఈ సందర్భంగా మాట్లాడుతూ వేమూరు శాసనసభ్యులు, మాజీ

మంత్రి నక్క ఆనందబాబు, కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా నాలుగవ సెగ్మెంట్లో ఎంపీటీసీ అభ్యర్థిగా మనకు అవకాశం కల్పించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలుపట్ల తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా తనను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అదేవిధంగా జిల్లా పరిషత్ సభ్యులుగా తెలుగుదేశం అభ్యర్థి నక్కా శ్రీనివాస్ రావును కూడా అధిక మెజార్టీతో గెలిపించాలని కుమారస్వామి కోరారు. ఈ ప్రచారంలో బట్టు మల్లికార్జున రావు, ఎర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు, జక్కా బాలాజీ, జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఎర్రంశెట్టి రవీంద్ర, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై పీఓలు, ఏపీఓలకు శిక్షణ

ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు సూచనలు

బాపట్ల రక్షణ న్యూస్

బాపట్ల జిల్లాలో నవంబర్ 5న నిర్వహించనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అధికారులు సూచించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్ వి. ఆదేశాల మేరకు గురువారం బాపట్ల పట్టణ పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ప్రిసైడింగ్ అధికారులు (పీఓలు), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓలు)కు రెండో విడత శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ రోజు నిర్వహించాల్సిన విధులు, పోలింగ్ కేంద్రాల్లో పాటించాల్సిన ఎన్నికల నిబంధనలు, ఓటింగ్ ప్రక్రియ నిర్వహణ, పోలింగ్ సామగ్రి వినియోగం, ఎన్నికలకు సంబంధించిన రికార్డుల

నిర్వహణపై అధికారులు వివరించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని సంబంధిత అధికారులకు అప్పగించే విధానాలపై అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్లు జి. ఉదయ్ శంకర్, సీహెచ్. బాలకోటేశ్వరరావు బ్యాలెట్ బాక్సుల నిర్వహణ, వివిధ రకాల కవర్ల వినియోగం, ఎన్నికల ఫారాలను సక్రమంగా పూర్తి చేసే విధానాలను క్షుణ్ణంగా వివరించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, విధుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ, బాపట్ల మండల ఆర్ఓ శివలీల, ఎంఈఓ ఎస్. నిరంజన్, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్

రేపల్లె రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నామని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామ హేశ్వర్ ఐపీఎస్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గురువారం రేపల్లె సబ్ డివిజన్ పోలీస్ అధికా రులతో సమీక్షా సమావేశం నిర్వహించి, ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. రేపల్లె ఏబీఎం డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లు, కౌం టింగ్ కేంద్రాలు, ప్రకాశం మున్సిపల్ స్కూల్‌లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, పటిష్ట భద్రత కల్పించాలని అధికారులను ఆదేశించారు. రేపల్లె మున్సిపాలిటీలోని 36 వార్డుల పరిధిలో 44 పోలింగ్ బూత్‌లకు మూడు జోన్లు, ఏడు రూట్ మొబైల్స్, రెండు స్ట్రైకింగ్ ఫోర్స్‌లు, రెండు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కోసం 23 జోన్లు, 49

రూట్ మొబైల్స్, తొమ్మిది స్ట్రైకింగ్ ఫోర్స్‌లు, నాలుగు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లను సిద్ధం చేశామన్నారు. పోలీస్ బలగాల సమన్వయం, వేగవంతమైన స్పందన కోసం 'సమర్థ్' మొబైల్ యాప్‌ను రూపొం దించామని, తొలుత చీరాల, రేపల్లె మున్సిపల్ ఎన్నికల్లో వినియోగించనున్నట్లు వెల్లడించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, రౌడీషీటర్లు, పాత నేరస్థులపై బైండోవర్ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. సమస్యలు తలెత్తితే ఎలక్షన్ సెల్ కంట్రోల్ రూమ్ 8333813228 లేదా అత్యవసర నంబర్ 112కు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎల్. సుధాకర్, డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచారం చేస్తే చర్యలు తప్పవు

డీఎస్పీ చంద్రమౌళి

బాపట్లలో పట్టణం టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ చంద్రమౌళి మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారం, సమావేశాలు, వాహనాల వినియోగానికి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించినా, గొడవలు, అల్లర్లకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేని వాహనాలను సీజ్ చేయడంతో పాటు జరిమానాలు విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల టౌన్ సిఐ ఆర్ రాంబాబు, రూరల్ సీఐ ఎస్ సుబ్బారావు, పాల్గొన్నారు

కూటమి అభ్యర్థుల విజయమే ప్రథమ లక్ష్యం

పొన్నూరు రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పిలుపునిచ్చారు. గురువారం గుంటూరు జిల్లా పొన్నూరులోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన పొన్నూరు మండలం జడ్పీటీసీ జనసేన పార్టీ అభ్యర్థి సూదా ప్రభావతి పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఉమ్మడి పార్టీల నాయకులు పరస్పర సహకారంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొని, అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా పనిచేయాలని కోరారు. కూటమి శ్రేణులంతా సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

అన్నదాతలకు తక్షణ పరిహారం అందించాలి

భట్టిప్రోలు రక్షణ న్యూస్

బంగాళాఖాతంలో ఏర్పడిన ఆర్నాబ్ తుఫాన్ ప్రభావంతో పంటలను నష్టపోయిన రైతులను, కౌలు రైతులను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి తక్షణం ఆదుకోవాలని సిపిఐ డిమాండ్ చేసింది. తుఫాన్ కారణంగా పెనుగాలులతో కూడిన వర్షానికి భట్టిప్రోలు మండలంలో నెలకొరిగిన వరి పంట పొలాలను గురువారం సిపిఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు గొట్టుముక్కల బాలాజీ, బండారు శ్రీనివాసరావులు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ఆహార పంటలకు ఎకరాకు రూ. 50 వేలు, వాణిజ్య పంటలకు రూ. 75 వేలు చొప్పున పరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు. పంటల సాగులో అనేక కష్టాలను ఎదుర్కొని పంటల పైర్లను కాపాడుకుంటూ వచ్చిన అన్న దాతలను ఆర్నాబ్ తుఫాన్ నిలువునా ముంచిందని దింతో వేలాది రూపాయలను ఖర్చు చేసి పంటలను సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్ట పోవడం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని బాలాజీ, శ్రీనివాసరావులు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వి. శ్రీనివాసరావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

24-10-26 rakshana - Copy_praja jyothi Medhak.qxd 10/30/2026 5:47 AM Page 5

చీరాలలో కూటమి ఎన్నికల ప్రచార జోరు

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య పిలుపు

చీరాల రక్షణ న్యూస్

చీరాల పట్టణ అభివృద్ధి, సంక్షేమ పథకాల కొనసాగింపు కోసం రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య (ఎం.ఎం. కొండయ్య) ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కూటమి మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి శ్రీమతి హానీ స్పందన విజయమే లక్ష్యంగా నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని ఓటర్లను అభ్యర్థించారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని పేర్కొన్న ఎమ్మెల్యే, ఇదే అభివృద్ధి ప్రతి వార్డుకు చేరాలంటే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. "చెప్పాం... చేస్తున్నాం" అనే నినాదంతో ప్రజల ముందుకు వచ్చామని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.ఈ ప్రచారంలో 12వ వార్డు అభ్యర్థి గోలి స్వాతి, 23వ వార్డు అభ్యర్థి డోగుపర్తి ఉమామహేశ్వరరావు, 31వ వార్డు అభ్యర్థి మల్లేశ్వరి, 34వ వార్డు అభ్యర్థి డొక్కా అనిత కుమారి, 35వ వార్డు అభ్యర్థి మూలే ఉమాదేవి

గెలుపు కోసం నాయకులు ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ, చీరాల పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు ప్రశాంతమైన, సుందరమైన పట్టణంగా రూపుదిద్దుకోవాలంటే కూటమి అభ్యర్థుల గెలుపు కీలకమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య నాయకత్వంలో చీరాల మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ పదవితో పాటు మెజారిటీ కౌన్సిలర్ స్థానాలను కూటమి కైవసం చేసుకుంటుందనే ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, మిత్రపక్షాల నేతలు, స్థానిక ప్రముఖులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నినాదాలతో ప్రచార ప్రాంతం సందడిగా మారింది.

రేపల్లెలో మంత్రి అనగాని సత్యప్రసాద్ విస్తృత ప్రచారం

టీడీపీ కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించండి

రేపల్లె రక్షణ న్యూస్

రేపల్లె మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ పట్టణంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి కుర్ర అవర్ణతో పాటు, వార్డు కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. రేపల్లె పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల కోసం తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.రేపల్లె పట్టణంలోని 2, 3, 4వ వార్డుల్లో మంత్రి అనగాని సత్యప్రసాద్ పర్యటిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, ఓటర్లతో నేరుగా మాట్లాడి టీడీపీ మేనిఫెస్టోలోని అభివృద్ధి అంశాలను వివరించారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.రేపల్లె పట్టణ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఓటర్లు కూటమి అభ్యర్థులను ఆదరించి, ఆశీర్వదించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు, జనసేన, బీజేపీ కూటమి నేతలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పోలీసుల మంటూ రూ 15 లక్షలు దోచేశారు..!

మంగళగిరి రక్షణ న్యూస్

ఎన్నికల కోడ్ తనిఖీల పేరుతో నకిలీ పోలీసుల అవతారమెత్తి, నగదు తీసుకెళ్తున్న వ్యక్తిని బెదిరించి రూ.15 లక్షలు దోచుకున్న ఘటన మంగళగిరి పరిసరాల్లో కలకలం రేపింది. ముందస్తు సమాచారంతో పక్కా ప్రణాళిక రూపొందించిన నిందితులు, బాధితుడిని వెంబడించి అడ్డగించి, చంపేస్తామంటూ బెదిరించి నగదుతో ఉడాయించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేసి, రూ.15 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ కె. వెంకటేశ్వర్లు గురువారం సాయంత్రం మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. గుంటూరు నగరంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన షేక్ అన్వర్ ఆరెంజ్ స్టీల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను నిర్వహిస్తున్నాడు. అదే సంస్థలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న రఫీ ఉల్లా, యజమాని సూచన మేరకు రూ.15 లక్షల నగదును నల్ల బ్యాగులో ఉంచి స్కూటీ డిక్కీలో పెట్టుకొని కాజా టోల్‌గేట్ వైపు బయలుదేరాడు. ఈ నగదు తరలింపు విషయాన్ని ముందుగానే తెలుసుకున్న అన్వర్ వాహన డ్రైవర్ షేక్ జానీ, తన స్నేహితులతో కలిసి దోపిడీకి పథకం రచించినట్లు పోలీసులు వెల్లడించారు.పథకంలో భాగంగా షేక్ సూరజ్, షేక్ నాగూర్ భాష మఫ్టీలో పోలీసులమని

చెప్పుకుంటూ రఫీ ఉల్లాను అడ్డగించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా భారీ మొత్తంలో నగదు ఎలా తరలిస్తావంటూ ప్రశ్నించి బెదిరింపులకు దిగారు. అతడితో ఘర్షణకు దిగి, చంపేస్తామంటూ భయపెట్టి సెల్‌ఫోన్లను లాక్కొని నగదును స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. అనంతరం నాగార్జున యూనివర్సిటీ సమీపంలో రఫీ ఉల్లా స్కూటీని అడ్డగించి మరోసారి బెదిరించారు. షేక్ జానీ సూచన మేరకు సూరజ్, నాగూర్ భాష అతడితో ఘర్షణకు దిగి చొక్కా చించి, ప్రాణాలు తీస్తామని హెచ్చరించారు. ఆపై స్కూటీ డిక్కీని బలవంతంగా పగలగొట్టి, అందులోని రూ.15 లక్షల నగదును నల్ల బ్యాగుతో సహా తీసుకొని విజయవాడ వైపు పరారయ్యారు.బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం చినకాకాని రాజ్ కమల్ రోడ్డులోని మర్రిచెట్టు వద్ద షేక్ జానీ, షేక్ రియాజ్, షేక్ నాగూర్ భాషలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.15 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, నేరానికి వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఎన్నికల కోడ్ తనిఖీల పేరుతో ప్రజలను భయపెట్టి దోపిడీకి పాల్పడిన ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష

26 కౌంటర్లు సిద్ధం.. అధికారులకు కమిషనర్ ఆదేశాలు

గుంటూరు రక్షణ న్యూస్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని నగర కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. గురువారం కేంద్రాలను పరిశీలించి, రిటర్నింగ్, జోనల్, రూట్ అధికారులకు పలు సూచనలు చేశారు.నవంబర్ 1న పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించడంలో రద్దీ లేకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. విశ్వవిద్యాలయంలోని నాలుగు బ్లాకుల్లో మొత్తం 26 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నవంబర్ 3న జరిగే ఓట్ల లెక్కింపు కోసం ప్రతి స్టాల్ వద్ద రెండు టేబుళ్లు ఏర్పాటు చేయాలని, ఎన్నికల సామగ్రిని జాగ్రత్తగా స్వీకరించాలని ఆదేశించారు.అధికారులు తమకు కేటాయించిన స్టాళ్ల నిర్వహణను పర్యవేక్షిస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరి పొలాల్లో పర్యటించిన జిల్లా కలెక్టర్

తెనాలి రక్షణ న్యూస్

తుపాను ప్రభావంతో నేలవాలిన వరి పంటలను గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ పరిశీలించారు. తెనాలి మండలంలోని సోమసుందరపాలెం, కంచర్లపాలెం గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడి పంట నష్టాన్ని తెలుసుకున్నారు.పొలాల్లో నిలిచిన నీటిని తొలగించి, పంటలను కాపాడేందుకు అవసరమైన సూచనలు రైతులకు అందించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో అంచనా వేసి నివేదికలు సమర్పించాలని సూచించారు. రైతులకు అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందే

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

గుంటూరు రక్షణ న్యూస్

గుంటూరు నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలని అదనపు ఎన్నికల అధికారి, నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.నవంబర్ 1న ఆదివారం ఎన్నికలు జరగనున్నందున, నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందే ప్రచారాన్ని నిలిపివేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, వారి మద్దతుదారులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు.మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం--1955లోని సెక్షన్ 600 ప్రకారం పోలింగ్‌కు ముందు 48 గంటల వ్యవధిలో ఎన్నికలకు సంబంధించిన బహిరంగ సభలు, ఊరేగింపులు, నిషేధిత ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ నిబంధనలను పాటిస్తూ శుక్రవారం సాయంత్రం 5 గంటల్లోగా ప్రచార కార్యక్రమాలను ముగించాలని కోరారు.

24-10-26 rakshana - Copy_praja jyothi Medhak.qxd 10/30/2026 5:47 AM Page 6

పల్లెల్లో హోరు.. నరేంద్ర జోరు!

మొదటి పేజీ తరువాయి

జగదీష్ బాపట్ల రక్షణ ప్రత్యేక ప్రతినిధి..

పల్లెల్లో రాజకీయ సందడి పతాకస్థాయికి చేరింది.. ప్రచార బరిలో అడుగుపెట్టిన బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు తనదైన శైలిలో ఎన్నికల వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు. ఎక్కడ చూసినా నాయకులు, కార్యకర్తల సందడి.. మరోవైపు యువత కేరింతలు, డాన్సులు, స్టెప్పులతో ప్రచారానికి కొత్త ఊపు తీసుకొస్తున్నారు. గ్రామాల్లో సాధారణ రాజకీయ ప్రచారానికి భిన్నంగా ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టిస్తున్న నరేంద్ర వర్మ వ్యూహాలు స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం నింపుతూ ఆయన సాగిస్తున్న ప్రచారం గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఎక్కడ చూసినా ఎన్నికల సందడే!...కర్లపాలెం మండలంలోని దమ్మనవారిపాలెం, బిడారుదిబ్బ, దుండివారిపాలెం, యాజలి, బుద్ధాం, యేట్రవారిపాలెం, పాతనందాయపాలెం, కొత్తనందాయపాలెం గ్రామాలతో పాటు కర్లపాలెం-1, 2, 3 ప్రాంతాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరిస్తూ కూటమి అభ్యర్థులను పరిచయం చేశారు. స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలపై ఆరా తీస్తూ అభ్యర్థుల విజయానికి సహకరించాలని ఓటర్లను కోరారు. ఎమ్మెల్యే రాకతో పలు గ్రామాల్లో కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా స్వాగతం పలికారు. పూలతో అభినందిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

యువతతో జోష్.. ప్రచారంలో కొత్త హుషారు!

ప్రచారంలో నరేంద్ర వర్మ అనుసరిస్తున్న తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రజలతో కలిసిమెలిసి ముందుకు సాగడం, యువతను ఉత్సాహపరిచేలా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రచారానికి సందడి తీసుకొస్తున్నారు. డాన్సులు, స్టెప్పులు, నినాదాలతో కార్యకర్తలు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అయితే ఈ ఉత్సాహం ఓట్లుగా ఎంతవరకు మారుతుందన్నది ఎన్నికల ఫలితాలే తేల్చనున్నాయి. గ్రామాల్లో ప్రజల స్పందనను అంచనా వేస్తూ, స్థానిక సమీకరణాలకు అనుగుణంగా ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తున్న తీరు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా..జెడ్పీటీసీ కూటమి అభ్యర్థి నక్కల లక్ష్మి, ఎంపీటీసీ--ఎంపీపీ అభ్యర్థి చీరాల శ్రీనివాసరెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. బుద్ధాం ఎంపీటీసీ అభ్యర్థి పమిడి సింహాద్రి, యాజలి అభ్యర్థి దామర్ల వీర రాఘవయ్య, దుండివారిపాలెం అభ్యర్థి కేసాని యేసుబాబు ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. మరో విడత ప్రచారంలో జనసేన బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణతో పాటు నల్లమోతువారిపాలెం అభ్యర్థి సూరినేని రేవతి, కర్లపాలెం-1 అభ్యర్థి పిట్టు శ్రీపావని రెడ్డి, కర్లపాలెం-2 అభ్యర్థి షేక్ మైమునిస్సా, కర్లపాలెం-3 అభ్యర్థి బుర్ల లీలావతి పాల్గొన్నారు.మొత్తానికి కర్లపాలెం మండలంలో ప్రచార పర్వం కొత్త ఊపందుకుంది. ఒకవైపు గ్రామస్థాయి పరిచయాలు, మరోవైపు యువత ఉత్సాహం, ఇంకోవైపు అభ్యర్థుల గెలుపు కోసం నాయకుల సమన్వయం.. ఇలా కూటమి ప్రచారం సాగుతోంది. నరేంద్ర వర్మ ప్రచార వ్యూహాలు, గ్రామాల్లో లభిస్తున్న స్పందన స్థానిక ఎన్నికల రాజకీయాల్లో ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ధూమ్ ధామ్.. దబిడి దిబిడే!

మొదటి పేజీ తరువాయి

మాచర్ల, ప్రత్యేక ప్రతినిధి (శిలార్):

మాచర్ల మున్సిపల్ ఎన్నికల పోరు చివరి అంకానికి చేరుతుండగా రాజకీయ తెరపై సరికొత్త దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. ప్రచారంలో ఎవరి బలం ఎంత? వ్యూహాల్లో ఎవరు పైచేయి సాధిస్తున్నారు? ఓటర్లను ఆకర్షించడంలో ఏ శిబిరం ముందంజలో ఉంది? అన్న ప్రశ్నల మధ్య అధికార టీడీపీ కూటమి ఒక్కసారిగా ప్రచార వేగాన్ని పెంచింది. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి రాజకీయ చతురతకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రచార బలం తోడవడంతో మాచర్ల వీధులు ఎన్నికల సందడితో హోరెత్తాయి. ముఖ్యంగా మైనార్టీ ఓటర్లు అధికంగా ఉన్న వార్డులపై గురిపెట్టిన కూటమి నేతలు.. ప్రత్యర్థి శిబిరానికి గట్టి పోటీ ఇచ్చే దిశగా అడుగులు వేస్తున్నారు. అయితే ఈ ప్రచార హోరులో జనసమీకరణ ఎంతవరకు ఓట్లుగా మారుతుందన్నదే అసలు పరీక్ష!

వ్యూహానికి పదును.. ప్రచారానికి ఊపు!

మాచర్ల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో టీడీపీ కూటమి ప్రచార వ్యూహంలో వచ్చిన మార్పు రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. గత రెండు రోజులుగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, టీడీపీ నాయకుడు ఎనుముల కేశవరెడ్డి స్థానిక రాజకీయ పరిస్థితులపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. వివిధ మండలాల్లో రాజకీయ సమీకరణాలను చక్కదిద్దడంతోపాటు, మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేసే దిశగా అడుగులు వేశారు. ఈ క్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును ప్రచార రంగంలోకి తీసుకొచ్చి పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. తక్కువ వ్యవధిలోనే ప్రచారానికి ఊపు తీసుకురావడం కూటమి వ్యూహంలో కీలక పరిణామంగా కనిపిస్తోంది.

మైనార్టీ వార్డులే టార్గెట్!...మాచర్లలోని 30 నుంచి 36వ వార్డుల వరకు గురువారం సాయంత్రం సాగిన ప్రచారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మైనార్టీ వర్గాల ఓటర్లు అధికంగా ఉన్న ఈ ప్రాంతాల్లో చైర్మన్ అభ్యర్థిని సుష్మారెడ్డితోపాటు కూటమి కౌన్సిలర్ అభ్యర్థులు జానీ, జాకీర్ హుస్సేన్, గౌస్బీ, సుభాని, బాబుఖాన్, దానం బాబు ప్రచారంలో పాల్గొన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఇతర నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారానికి దిగడంతో రాజకీయ సందడి నెలకొంది. అంతకుముందు శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన నేతలు ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ వార్డుల్లో ఓటర్ల మద్దతును కూడగట్టుకోవడం ద్వారా మున్సిపల్ పీఠంపై పట్టు సాధించాలన్నది కూటమి వ్యూహంగా కనిపిస్తోంది.

గుర్తులే గందరగోళం.. వైసీపీకి పరీక్ష!...మరోవైపు వైసీపీ శిబిరానికి ఎన్నికల గుర్తుల వ్యవహారం సవాలుగా మారినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వర్గం ఎన్నికల బరిలో ఉన్నప్పటికీ, అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం మూడు వార్డుల్లో అభ్యర్థులు ఫ్యాన్ గుర్తుపై, మిగిలిన 33 వార్డుల్లో బీరువా గుర్తుపై పోటీ చేస్తున్నారు. ఈ పరిస్థితి ఓటర్లకు అభ్యర్థుల గుర్తింపుపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది కీలకంగా మారింది. అయితే గుర్తుల అంశం ఒక్కటే ఎన్నికల ఫలితాలను నిర్ణయించదు. అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, స్థానిక సమస్యలపై స్పందన, పార్టీ యంత్రాంగం పనితీరు కూడా ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేయనున్నాయి.

మున్సిపల్ పోరు.. జెడ్పీ పీఠంపై ప్రభావం?

మాచర్ల మున్సిపల్ ఎన్నికల ప్రభావం జిల్లా పరిషత్ రాజకీయాలపైనా పడే అవకాశముందన్న చర్చ మొదలైంది. జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి సంబంధించి డాక్టర్ ఉన్నం దీపిక, డాక్టర్ వెంకటలక్ష్మీ సరోజా సహా మహిళా నేతల పేర్లు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఏకగ్రీవంగా ఎన్నికైన కారంపూడి జెడ్పీటీసీ కొండపల్లి శివకుమారి, నల్లపాటి కీర్తన తదితర నేతలు కూడా తమ అభ్యర్థుల తరపున ప్రచారంలో నిమగ్నమయ్యారు. గాలి శ్రీనివాసరావు, సుధాకర్‌రెడ్డి, గోపిరెడ్డి, మస్తాన్ జానీ, గుండాల శ్రీనివాసరావు తదితర నాయకుల ప్రచార భాగస్వామ్యం కూటమి శిబిరానికి బలాన్ని చేకూర్చే ప్రయత్నంగా కనిపిస్తోంది.

మొత్తానికి మాచర్ల ఎన్నికల బరిలో ఇప్పుడు ప్రచార వేగం, రాజకీయ వ్యూహాలు, గుర్తుల ప్రభావం ప్రధాన చర్చాంశాలుగా మారాయి. టీడీపీ కూటమి దూకుడు ఓట్లుగా మారుతుందా? వైసీపీ తన శిబిరాన్ని ఎంతవరకు సమన్వయం చేసుకోగలుగుతుంది? అన్నది నవంబర్ 1న జరిగే పోలింగ్‌తో తేలనుంది. ప్రచారంలో కనిపిస్తున్న హడావుడికి మించి, నిశ్శబ్దంగా ఓటరు తీసుకునే నిర్ణయమే మాచర్ల మున్సిపల్ పీఠం భవితవ్యాన్ని నిర్దేశించనుంది.

ప్రజాబలానికి లక్కం రాజు కేరాఫ్..

మొదటి పేజీ తరువాయి

పిట్టలవానిపాలెం రక్షణ న్యూస్

రాజకీయాల్లో పదవులు ఎన్నో వస్తాయి.. పోతాయి. కానీ ప్రజల మనసుల్లో సంపాదించుకున్న స్థానం మాత్రం అంత సులువుగా చెరిగిపోదు. ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావించి, వారి సమస్యలను తన బాధ్యతగా స్వీకరించే నాయకుడికే జనహృదయాల్లో ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. పిట్టలవానిపాలెం మండలంలో లక్కం రాజు వెంకటపతి రాజు ప్రస్థానాన్ని ఆయన అనుచరులు ఇదే కోణంలో అభివర్ణిస్తున్నారు. ప్రజలతో మమేకమవుతూ, అవసరమైన వేళ అండగా నిలుస్తూ ఆయన ఏర్పరచుకున్న అనుబంధానికి రాజకీయంగా మరో గుర్తింపు లభించిందని చెబుతున్నారు. ఆయన సతీమణి ఆదిలక్ష్మి ఎంపీటీసీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో మండలంలో రాజకీయ చర్చకు తెరలేచింది.

ప్రజలతో అనుబంధం.. ఆత్మీయ బంధం!

నాయకుడికి ప్రజలకు మధ్య ఉండాల్సింది కేవలం ఓటు సంబంధం కాదు.. నమ్మకంతో కూడిన బంధం. ప్రజల సమస్యలను వినడం, వారి అవసరాలను గుర్తించడం, పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాలే నాయకుడి పనితీరుకు అసలైన కొలమానాలు. లక్కం రాజు వెంకటపతి రాజు ఆయన సతీమణి ఆదిలక్ష్మి విషయంలోనూ ఈ ప్రజాసంబంధాలే ప్రధానంగా చర్చకు వస్తున్నాయి. మంతెనవారిపాలెంలో ప్రారంభమైన ఆయన ప్రస్థానం, పిట్టలవానిపాలెం మండలంలో ప్రజలతో ఏర్పడిన అనుబంధం ద్వారా మరింత విస్తరించిందని ఆయనకు సన్నిహితులు పేర్కొంటున్నారు.

కష్టంలో తోడు.. ప్రజలకు అండ!...ప్రజలకు కష్టం వచ్చినప్పుడు ఎవరు గుర్తుకొస్తారన్నదే నాయకుడి పట్ల వారికి ఉన్న విశ్వాసాన్ని తెలియజేస్తుంది. రైతులకు ఎదురయ్యే ఇబ్బందులు, గ్రామస్థాయి సమస్యలు, ప్రజలకు అవసరమైన సహకారం వంటి అంశాల్లో వెంకటపతి రాజు అందుబాటులో ఉంటారనే అభిప్రాయం స్థానికంగా ఆయనకు మద్దతుగా నిలుస్తోందని అనుచరులు చెబుతున్నారు. ప్రజాసేవను ఎన్నికల సమయంలో మాత్రమే పరిమితం చేయకుండా నిరంతర బాధ్యతగా చూడాలనే ఆయన వైఖరి తమకు నచ్చిందని వారు పేర్కొంటున్నారు. ఈ అనుబంధమే నేడు రాజకీయ గుర్తింపుగా మారిందని ఆయన వర్గం విశ్లేషిస్తోంది.

ఇంటా.. ప్రజాసేవ బాట!...ప్రజాసేవలో ఒక వ్యక్తి ప్రయాణం కుటుంబ సభ్యుల భాగస్వామ్యంతో ముందుకు సాగితే, స్థానిక రాజకీయాల్లో దానికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడుతుంది. వెంకటపతి రాజు సతీమణి ఆదిలక్ష్మి ఎంపీటీసీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఈ నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకుంది. కుటుంబానికి లభించిన రాజకీయ అవకాశాన్ని ప్రజలకు మరింత చేరువయ్యేందుకు వినియోగించుకోవాల్సిన బాధ్యత కూడా పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం, వారి సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వడం, స్థానిక అవసరాలపై దృష్టి సారించడం కొత్త బాధ్యతలో కీలకం కానున్నాయి.

సొంత మండలంలో టీడీపీ జోష్!...బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ సొంత మండలమైన పిట్టలవానిపాలెంలో ఆదిలక్ష్మి ఏకగ్రీవ ఎన్నిక కావడం టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంచింది. స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఈ పరిణామం రాజకీయంగా చర్చనీయాంశమైంది. పార్టీ నాయకత్వానికి, క్షేత్రస్థాయి కార్యకర్తలకు ఇది ప్రోత్సాహకర సంకేతంగా కనిపిస్తోంది. అయితే ఈ ఒక్క ఫలితం ఆధారంగా మొత్తం నియోజకవర్గ రాజకీయాలపై అంచనా వేయడం తొందరపాటే అవుతుంది. రాబోయే ఎన్నికల్లో ఇతర ప్రాంతాల్లోని అభ్యర్థుల బలం, స్థానిక సమస్యలు, ప్రజల నిర్ణయాలు కూడా కీలక పాత్ర పోషించనున్నాయి.

దేవుడి సన్నిధిలోనే న్యాయం కోసం పోరాటం!

కోటప్పకొండ, రక్షణ న్యూస్:

భక్తులకు ధర్మమార్గాన్ని బోధించే పవిత్ర ఆలయంలోనే న్యాయం కోసం అర్చకులు గళమెత్తాల్సిన పరిస్థితి ఏర్పడిందన్న ఆవేదన కోటప్పకొండలో చర్చనీయాంశంగా మారుతోంది. పల్నాడు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం త్రికోటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుల మధ్య నెలకొన్న విభేదాలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయన్న ప్రచారం సాగుతోంది. కానుకల వాటాల పంపకం, ఉద్యోగ నియామకాల వ్యవహారాలు వివాదానికి ప్రధాన కారణాలుగా వినిపిస్తున్నాయి. కొందరు అర్హతలేని వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించారంటూ, ఇందుకు అక్రమ లావాదేవీలు కారణమయ్యాయంటూ ఓ వర్గం అర్చకులు ఆరోపిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలపై అధికారిక విచారణ వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

నియామకాలపై అనుమానాలు...ఆలయంలో ఉద్యోగ నియామకాల ప్రక్రియ నిబంధనల ప్రకారం జరిగిందా? అర్హతలు, అనుభవం, ఇతర ప్రమాణాలను పరిగణనలోకి తీసుకున్నారా? కానుకల వాటాల పంపకంలో అనుసరిస్తున్న విధానం ఏమిటి? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. అర్చకుల మధ్య తలెత్తిన విభేదాలకు సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు చేసినవారి నుంచి వివరాలు సేకరించడంతోపాటు, రికార్డులు పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని పలువురు కోరుతున్నారు.

భక్తుల విశ్వాసమే కీలకం...కోటప్పకొండకు నిత్యం భక్తులు తరలివచ్చి త్రికోటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. మొక్కులు చెల్లించుకుంటూ ఆలయంపై అపార విశ్వాసాన్ని ప్రదర్శిస్తారు. అలాంటి పవిత్ర క్షేత్రంలో అంతర్గత విభేదాలు బహిరంగ చర్చకు రావడం ఆలయ ప్రతిష్ఠపై ప్రభావం చూపే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సమస్యలు ఉంటే వాటిని పారదర్శకంగా పరిష్కరించడం ద్వారా భక్తుల్లో నమ్మకాన్ని మరింత బలోపేతం చేయవచ్చని పలువురు భావిస్తున్నారు.

ఉన్నతాధికారులు స్పందించేనా?..అర్చకుల సమస్యలపై సంబంధిత దేవాదాయ శాఖ అధికారులు దృష్టి సారించి, ఇరువర్గాల వాదనలు వినాలని భక్తులు కోరుతున్నారు. ఆరోపణల్లో వాస్తవాలు తేల్చేందుకు నిష్పక్షపాత విచారణ చేపట్టాలని, తప్పులు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఆలయ నిర్వహణలో పారదర్శకత, ఉద్యోగ నియామకాల్లో నిబంధనల అమలు, కానుకల పంపకంలో స్పష్టత ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అర్చకుల మధ్య వివాదానికి శాశ్వత పరిష్కారం చూపి, ఆలయ పవిత్రతకు, భక్తుల విశ్వాసానికి భంగం కలగకుండా అధికారులు చొరవ తీసుకుంటారా అన్నది వేచి చూడాలి.